క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



దాత హరీష్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ప్రధానార్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజోలుకు చెందిన చొప్పర్ల నాగరాజ హరీష్ రూ.10,116, అమలాపురానికి చెందిన కోక పావని రూ.10 వేలు విరాళంగా మంగళవారం అందజేశారు. దాతలకు ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతలను ఆలయ ప్రధానార్చకుడు, ఆలయ వేదపండితులు వేదమంత్రాలతో సత్కరించారు. వీరికి స్వామి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

పోషకాహార కిట్ల పంపిణీ

సఖినేటిపల్లి: మండలంలోని మోరిపోడులో సుబ్బమ్మ మిషన్ ఆసుపత్రిలో మంగళవారం మలికిపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 25 మంది గర్భిణులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ మేరకు క్లబ్ అధ్యక్షుడు గెడ్డం ఫిలిప్ రాజు, క్లబ్ ప్రతినిధులు వీటిని వారికి అందజేశారు. ఆసుపత్రి వైద్యులు లతా పాల్ మాట్లాడుతూ, గర్భిణులకు పోషకాహారంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా అంతే అవసరమని తెలిపారు. క్లబ్ తరఫున చేపడుతున్న సేవా కార్యక్రమాల గురించి అధ్యక్షుడు ఫిలిప్ రాజు వివరించారు. క్లబ్ కార్యదర్శి డాక్టర్ బందెల సంపత్ కుమార్, రొటేరియన్స్ గెడ్డం పేర్రాజు, అల్లూరి మధురాజు, నల్లి శివకుమార్, గెడ్డం తులసీభాస్కరరావు, సందెపూడి ఆదాం, రాపాక విజయారావు, ఎన్నార్ఐ రాజశేఖర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

డయాలసిస్ రోగికి సాయం పంపిణీ



సఖినేటిపల్లిలంకలో డయాలసిస్ రోగికి సాయం చేస్తున్న పెద్దలు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక గ్రామానికి చెందిన డయాలసిస్ పేషెంట్ వెలుచూరి శ్రీనివాస్‌కు అదే గ్రామానికి చెందిన దాతలు మొత్తం రూ.17 వేల ఆర్థిక సాయం మంగళవారం చేశారు. ఇందులో నల్లి ప్రమీల రూ.7 వేలు, టి.షకీనా, షకీనా స్నేహితులు కలిపి రూ.10 వేలు నగదు సమకూర్చారు. ఈ మేరకు పై మొత్తాన్ని శ్రీనివాస్‌కు ఇంటి వద్ద జిల్లెళ్ళ ప్రసాద్, యల్లమెల్లి కిషోర్ చేతుల మీదుగా అందజేశారు. గేదెల శేఖర్, నల్లి జయప్రకాష్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సేవలు అభినందనీయం

రాజోలు: సచివాలయ ఉద్యోగుల సేవలు అభినందనీయమని సోంపల్లి సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో సోంపల్లి సచివాలయంలో విధులు నిర్వహించి వేరే ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉద్యోగులను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన సచివాలయ ఉద్యోగులను శాలువాలతో సత్కరించారు. సుమారు ఆరేళ్ల పాటు గ్రామంలో సేవలు అందించడంపై సంతోషం వ్యక్తం చేశారు. మండల ఉపాధ్యక్షుడు పాలమూరి శ్యాంబాబు, పంచాయతీ కార్యదర్శి పవన్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో గేదెదూడ మృతి

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో మంగళవారం జరిగిన వీధి కుక్కల దాడిలో గేదెదూడ మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం బొబ్బా వారి పుంత సమీపంలో పేపకాయల వీరబాబుకు చెందిన పశువుల మకాం ఉంది. అందులో ఉన్న గేదెదూడపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. దీంతో యజమాని చికిత్సను అందించే లోపే దూడ మృతి చెందింది. ఈ సంఘటన గ్రామంలో భయభ్రాంతులకు గురిచేసింది. ఈ వీధికుక్కలు భవిష్యత్‌లో మనుషులపై కూడా దాడి చేస్తాయోమోనని ఆందోళన చెందుతున్నారు. అలాగే స్థానిక పీహెచ్‌సీ వద్ద వీధి కుక్కలో ఒక కుక్కపిల్ల ప్రతి రోజు రోగులను గాయపరుస్తుంది. రాత్రి వేళల్లో అయితే ఆస్పత్రికి రావడానికి భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఇకనైనా మండల, గ్రామ పంచాయతీ అధికారులు సత్వరమే దృష్టి సారించి కుక్కల స్వైర విహారాన్ని నివారించకపోతే రేబిస్ వ్యాధి విస్తృతమయ్యే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ఆలయ అభివృద్ధికి విరాళం

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.5,116 విరాళం అందింది. కలవచర్లకు చెందిన దాత వడ్డి మణిబాబు మంగళవారం ఆలయానికి చేరుకుని దేవదాయశాఖ ప్రతినిధులకు అందజేశారు. తాను సమర్పించిన విరాళాన్ని రాజగోపురాల నిర్మాణానికి ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కూటమి నాయకుల భవిష్యత్తుకే బాబు గ్యారంటీ

- ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని నిలదీద్దాం
- నియోజకవర్గంలో అవినీతికి గేట్లు ఎత్తేసిన పాలకులు
- జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి ధ్వజం



కొత్తపేటలో వైఎస్సార్ సీపీ మండల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

కొత్తపేట: 'బాబు ష్యూరిటీ – భవిష్యత్‌కు గ్యారంటీ' అంటే సీఎం చంద్రబాబు దృష్టిలో 'బాబు ష్యూరిటీ – కూటమి నాయకుల భవిష్యత్‌కు గ్యారంటీ' అని అర్థమని మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి విమర్శించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో సోమవారం 'బాబు ష్యూరిటీ – భవిష్యత్‌కు గ్యారంటీ' పేరిట మండల స్థాయి వైఎస్సార్ సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు సిరిపురపు శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎప్పుడు అధికారం చేపట్టినా ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం ఏమాత్రం కాదని, కేవలం ఆయన కుటుంబం, ఆయన వర్గీయుల ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా పరిపాలన సాగించారని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్ సంతకాలు చేసిన బాండ్లను ప్రజలకు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఆ బాండులో పేర్కొన్న ఒక్క సంక్షేమ పథకం అమలు చేయలేదని ధ్వజమెత్తారు.

అవినీతికి గేట్లు ఎత్తేశారు

నియోజకవర్గంలో కూటమి ముఖ్యంగా టీడీపీ నాయకులు అవినీతికి గేట్లు ఎత్తేశారని జగ్గిరెడ్డి ఆరోపించారు. అధికార పార్టీ నాయకులు చిరుద్యోగుల పొట్ట కొడుతున్నారని, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్స్, డ్వాక్రా యానిమేటర్స్, ఏఎంసీ సిబ్బందిని అన్యాయంగా తొలగిస్తున్నారని వారి దయనీయ స్థితి చూస్తే జాలేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోని తమ హయాంలో లంచాలకు తావు లేకుండా ఉద్యోగాలు కల్పించామని, టీడీపీ సానుభూతిపరులైనా సరే వారిని ఉద్యోగాల నుంచి తొలగించలేదు. ఏ ఒక్కరి పొట్ట కొట్టలేదని అన్నారు. తమను ఆశ్రయించి ఎవరు వచ్చినా వారి కుటుంబ పరిస్థితిని చూసి, వారి కడుపు చూసి పనులు చేశామన్నారు. ఇక్కడ టీడీపీని లిక్కర్ పార్టీగా మార్చారని ఎద్దేవా చేశారు. వివిధ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు గాని రుణాలు మాత్రం ఇవ్వడం లేదని, ముఖ్యంగా కాపు కార్పొరేషన్ రుణాల విషయంలో జనసేన ఇన్‌చార్జ్, ఆ పార్టీ నేత పవన్‌కల్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు సముచిత గౌరవం లభిస్తుందని, మీ కృషిని గుర్తించి పదవులు కట్టబెడతామని హామీ ఇచ్చారు. చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలు వివరించే 'రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో' క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను స్థానిక పార్టీ నేతలతో కలసి జగ్గిరెడ్డి ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, పార్టీ సీనియర్ నాయకులు కర్రి నాగిరెడ్డి, ముసునూరి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు, మండల యువజన విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి స్వరూప్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు గుత్తుల శ్రీనివాసరావు (వాసు) తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెంలో వైఎస్సార్ సీపీ మండల కమిటీ కన్వీనర్‌గా ఎంపికైన కరుణాకర్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



నేదునూరులో బాబు మోసాల కరపత్రాలను ప్రదర్శిస్తున్న కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు

పార్టీ మండల నూతన కార్యవర్గం

మండల నూతన అధ్యక్షుడిగా ముత్యాల వీరభద్రరావుకు తిరిగి మళ్లీ అవకాశం కల్పించారు. ఉపాధ్యక్షులుగా ఇసుకపట్ల ఆనందప్రసాద్, బొంతు రాజు, ప్రధాన కార్యదర్శులుగా గ్రంధి చంద్రరావు, పితాని వెంకట సూర్య రామమోహనరావు (రాంబాబు), కొండేటి శ్రీను, గోగి సురేష్, కార్యదర్శులుగా జక్కంశెట్టి రమేష్, పచ్చిపులుసు బుజ్జిబాబు, ఉందుర్తి నాగేశ్వరరావు (ఆర్‌కే), కార్యవర్గ సభ్యులుగా 17 మందిని ప్రకటించారు. వారందరినీ అభినందిస్తూ పార్టీ కండువాలతో సత్కరించారు.

ప్రజలను మోసగించడమే చంద్రబాబు నైజం

రావులపాలెం: గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసగించడమే సీఎం చంద్రబాబు అజెండాగా పెట్టుకున్నారని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెంలోని రెడ్డి కళ్యాణ మండపం కమ్యూనిటీ హాలులో మండల బూత్ మేనేజర్ కర్రి గోవింద కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు సిరిపురపు శ్రీనివాసరావు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయకుండా దొడ్డిదారిన విద్యుత్ చార్జీలు పెంచారని ఆరోపించారు. సుపరిపాలనలో తొలి అడుగు అంటూ టీడీపీ చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు ఎవరూ నమ్మడం లేదన్నారు. చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలు వివరించే 'రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో' క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను స్థానిక పార్టీ నేతలతో కలసి మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆవిష్కరించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు చిరునామా దివంగత నేత వైఎస్సార్ తరువాత మాజీ సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని నియోజకవర్గ పరిశీలకుడు సిరిపురపు శ్రీనివాసరావు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను గత వైఎస్సార్ సీపీ పాలనతో పోల్చుకుని సంక్షేమ పథకాల్లో తమకు జరిగిన నష్టంతో అన్ని వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఆరోపించారు.

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా బొక్కా కరుణాకర్

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా వెదిరేశ్వరం గ్రామానికి చెందిన బొక్కా కరుణాకర్‌ను ప్రకటించారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలను కార్యవర్గంలోకి తీసుకున్నారు. వారందరినీ మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, పరిశీలకుడు సిరిపురపు ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, గ్రామ సర్పంచ్‌లు తాడేపల్లి నాగమణి, అంబటి సుబ్బలక్ష్మి, సబ్బితి మోహన్‌రావు, ఎంపీటీసీలు గూటం తిమోతి ప్రకాశరావు, మైనారిటీ సెల్ జిల్లా సభ్యుడు షేక్ వలీబాబు, మాజీ ఎంపీటీసీ మల్లిడి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అంటేనే నట్టేట ముంచడం: కోఆర్డినేటర్ గన్నవరపు

అయినవిల్లి: సీఎం చంద్రబాబు పేరు చెబితే రాష్ట్ర ప్రజలకు గుర్తుకు వచ్చే మాటలు, దగా, నమ్మించి వెన్నుపోటు పొడవటం, నట్టేట ముంచడం అని పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పెన్మత్స చిట్టిరాజు, పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం నేదునూరు, అయినవిల్లి గ్రామాల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీనివాస్ అధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీలో భాగంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. మహిళలకు ఆడబిడ్డ పథకం ఇవ్వలేదన్నారు. తల్లికి వందనం పథకంలో అర్హత ఉన్న విద్యుత్ వినియోగం పెరిగిందని ఇవ్వలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం లేదన్నారు. అర్హత ఉన్న పథకాలను ఏదో విధంగా ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అధికార దాహంలో వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. ఇచ్చే రేషన్ బియ్యం ఎలా ఉన్న వాటికోసం రోజువారి కూలి పోతుందని వాపోతున్నారన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్ పథకాలను కుదించి సామాన్యులను ఇబ్బందులు పెడుతున్నారని చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డినే గెలిపించుకుంటామని ప్రజలు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మాజీ కోఆర్డినేటర్ మండపాటి కిరణ్‌కుమార్, నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, నాయకులు కుడుపూడి విద్యాసాగర్, కసుమూరి సత్యనారాయణరాజు, కర్రి బాల సుబ్రహ్మణ్యం, వాసంశెట్టి తాతాజీ, కామన కృష్ణమూర్తి, మిండగుదిటి రాంబాబు, కమిడి వెంకటేశ్వరరావు, దాకారపు తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సదుపాయాలు కరవు



రాజోలు వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

రాజోలు: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు ఉండవలసిన కనీస సదుపాయాలు పూర్తిగా కరువయ్యాయని జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్ అన్నారు. మంగళవారం రాజోలులోని ఎస్సీ, బీసీ వసతి గృహాలను వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు సందర్శించి అక్కడి సమస్యలను గుర్తించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల అవస్థలను గుర్తించి వసతి గృహ సమస్యలను అధికారులు దృష్టికి తీసుకుని వెళ్తున్నామని శిరీష్ తెలిపారు. వసతి గృహాల్లో సమస్యలు పేరుకుపోయాయని, విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రక్షిత తాగునీరు అందడం లేదన్నారు. విద్యార్థి విభాగ ఉభయగోదావరి జిల్లాల రీజియన్ కో–ఆర్డినేటర్ జిల్లెళ్ల రమేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి తాడి సహదేవ్, నియోజకవర్గ అధ్యక్షుడు చెల్లింగి నవీన్, కరుణ సాయి, జంగిలి రాజేష్, ఉదయ్, కిరీటి, విన్సీ, గంటి ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్య, నాణ్యమైన మౌలిక వసతులు కల్పించాలి

రావులపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఇతర మౌలిక వసతులు కల్పించాలని జిల్లా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకోడంలో భాగంగా మంగళవారం రావులపాలెం బాలుర హైస్కూల్‌ను పరిశీలించారు. విద్యార్థి విభాగం నాయకులు కాసేపు విద్యార్థులతో మాట్లాడారు. విద్య, మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. భోజన పథకంలో ఉన్న ఇబ్బందులను, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యార్థులకి ఇచ్చినటువంటి బ్యాగులను, పుస్తకాల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గం వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి రాజశేఖర్, విద్యార్థి విభాగం జిల్లా నాయకులు కరుణ సాయి, మల్లిపూడి లోకేష్, శ్రీరామ్ మోహన్, చంద్రశేఖర్, రవి, యాగ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను సక్రమంగా అమలు చేయాలి

- మహిళలను, రైతులను మోసం చేయడం సరికాదు
- మండల సమావేశంలో జెడ్పీటీసీ నిలదీత



రావులపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు కె.శ్రీనివాసరావు

రావులపాలెం: ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల్లో మహిళల ఆర్థిక అభివృద్ధికి ఎంతో చేస్తామని వారికి డ్వాక్రా సంఘాల ద్వారా కాకుండా ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చేయూతనందిస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెప్పారని అలాగే మహిళలకు రాష్ట్రమంతా ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పి ఇప్పుడు పలు రకాల మెలికలు పెడుతున్నట్టు వస్తున్న విషయాలపై స్పష్టత ఇవ్వాలంటూ జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులను వివరణ కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఎంపీపీ కర్రి లక్ష్మివెంకట నాగదేవి ఆధ్వర్యంలో మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికను సభలో వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలకు ఇస్తున్న లోన్లు గత ప్రభుత్వంలో సక్రమంగా ఉండేవని లోన్లు మంజూరులో కానీ తిరిగి చెల్లింపులు చేయడంలో గాని అందరికీ సమాన న్యాయం జరిగేదన్నారు. ప్రసుత్తం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బ్యాంకర్లు మహిళలకు రుణాలు ఇచ్చేందుకు ఎన్నో ఆంక్షలు పెడుతున్నారని వీటిని అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలన్నారు. అలాగే ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన హామీలు ఒకరకంగా ఉంటే అమలులో అధికారులు చెబుతున్నది మరోరకంగా ఉన్నాయని ఇవి మహిళలను, రైతులను మోసం చేయడమేనన్నారు. అలాగే ఉచిత బస్సు విషయంలో రాష్ట్రమంతా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే విద్యుత్ స్మార్ట్‌మీటర్ల విషయంలో ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకుని వాటిని బలవంతంగా వేసే విధానాన్ని మానుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా గోపాలపురం సర్పంచ్ సబ్బితి మోహనరావు మాట్లాడుతూ పంచాయతీలకు వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు గత డిసెంబర్లోనే కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించినా నేటికీ ఆ నిధులు పంచాయతీలకు రాలేదని, వాటిని మళ్లించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రతి పనికి పంచాయతీ మీద అధికారులు ఆధారపడుతుంటే నిధులు లేకుండా పనులు ఎలా చేయాలో తమకు అర్థం కావడం లేదని దీనిపై అధికారులు ప్రభుత్వానికి నివేదించి పంచాయతీలకు 15 ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఇరిగేషన్ శాఖలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాలువల క్లోజర్ సమయంలో కాలువల్లో అడ్డంగా పడిన చెట్లను తొలగించకుండా ఇప్పుడు నీరు ఏ రకంగా కిందికి ఇస్తారో చెప్పడం లేదని కాలువల్లో ప్రవాహానికి అడ్డంగా ఉన్న చెట్లను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో ఈ.మహేశ్వరరావు, తహసీల్దార్ ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న భైరవమూర్తి

రాజోలు: రాజోలు తెలగ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అందిస్తున్న ఉపకార వేతనాలకు అర్హులైన తెలగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సంఘ నాయకులు కోరారు. మంగళవారం శివకోటి కాపు కల్యాణ మండపంలో సంఘ అధ్యక్షుడు పంగం శ్రీనాగ వెంకట భైరవమూర్తి అధ్యక్షతన సమావేశం జరిగింది. రాజోలు తెలగ ఉద్యోగుల సంక్షేమ సంఘం, తులసీ రామచంద్ర ప్రభు సంయుక్తంగా అర్హులైన తెలగ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నారన్నారు. వచ్చే నెల 15వ తేదీ లోగా దరఖాస్తులను ఆయా మండలాల బాధ్యులకు అందజేయాలన్నారు. మామిడికుదురు, రాజోలు, సఖినేటిపల్లి, మలికిపురం మండలాల కార్యవర్గ సభ్యులు, ఏపీ కేపీటీడబ్ల్యూఏ జిల్లా అధ్యక్షుడు మేడిచర్ల శ్రీనివాసరావు, రాజోలు నియోజకవర్గ అధ్యక్షుడు చవటపల్లి బాల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అల్లు శ్రీను, రాజోలు తాలూకా ప్రధాన కార్యదర్శి కొణతం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు... జీవితమే ముద్దు

అంబాజీపేట: జీవితాలను చిన్నాభిన్నం చేసే మత్తుపానీయలు, డ్రగ్స్ వంటికి దూరంగా ఉండాలని అన్నదమ్ములకు, మిత్రులకు... లైఫ్ సేవ్ బ్రో అని వివరించాలని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. అంబాజీపేట ఎస్ఎంఎం కళాశాలలో సీఐ ఆర్.భీమరాజు అధ్యక్షతన శక్తి యాప్‌పై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్‌ను సర్వనాశనం చేసే డ్రగ్స్ జోలికి వెళ్లకుండా ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని సూచించారు. ఆండ్రాయిడ్ సెల్ ఫోన్లలో వచ్చే సైబర్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనాధికార లింకులు, వెబ్ సైట్‌లు, మోసపూరిత ఫోన్ కాల్స్ వచ్చిన, ఓటీపీలు ఓపెన్ చేకుండా వదిలేయాలన్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్, ఫేస్‌బుక్‌లలో ఫేక్ అకౌంట్లతో వచ్చే వాటి గుర్తించి స్పందించవద్దన్నారు. కొత్తపేట డివిజన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే 32 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సై కె.చిరంజీవి, కళాశాల కరస్పాండెంట్ మట్టపర్తి సాయిప్రసాద్, ప్రిన్సిపాల్ ఎస్.రాధామణి, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

మలికిపురం: గుడిమెళ్ళంక భాష్యం పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలన, శక్తి యాప్‌పై అవగాహన సదస్సును పాఠశాల ప్రిన్సిపాల్ వి. వెంకటేశ్వరరావు అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మలికిపురం మండల ఎస్సై సురేష్ కుమార్ విచ్చేసి నేడు సమాజంలో జరుగుతున్న అనేక దారుణాలకు కారణం డ్రగ్స్ అని వాటిని ముందుగానే పసిగట్టి నిర్మూలించాలని పేర్కొన్నారు. ఆడపిల్లల పట్ల లైంగిక దాడులకు ఎవరైన ప్రేరేపిస్తున్న, పాల్పడుతున్న అసభ్యపదజాలం వాడుతున్నట్లు ఎవరైనా గమనించినట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు తెలియజేశారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కొత్తపేట: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని స్థానిక సీనియర్, జూనియర్ కోర్టుల ప్యానల్ అడ్వకేట్స్ సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బీవైఎస్‌వీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్యానల్ అడ్వకేట్స్ అల్లు భాస్కరరావు, ఆదినారాయణరావు, డి.బాలప్రతాప్, పీవీఎల్, నక్కా కృష్ణ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వివిద చట్టాలపై ముఖ్యంగా మాదకద్రవ్యాలు, పోక్సో చట్టం, యాంటీ ర్యాగింగ్ తదితర చట్టాలు, టీనేజ్‌లో పదేళ్ల దాటిన వారందరూ డ్రగ్స్ బారిన పడటం వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేసేవారికి గుర్తింపు

అంబాజీపేట: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసే ఏ ఉపాధ్యాయుడికైనా మంచి గుర్తింపు ఉంటుందని హెచ్ఎం ఎం.అక్కిరాజు శేషసాయి అన్నారు. గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మాడా సత్యసూర్యకుమారి, పెదశింగు సూర్యచంద్రరావులను మంగళవారం ఘనంగా సత్కరించారు. హెచ్ఎం మాట్లాడుతూ సత్యసూర్యకుమారి విద్యార్థులతో ఫిజికల్ సైన్స్‌లో వివిధ ప్రాజెక్టులు రూపొందించి రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు పొందారన్నారు. అలాగే ఇంగ్లీష్ బోధనలో సూర్యచంద్రరావు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించారన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఇద్దరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ తొత్తరమూడి గోవిందరావు, ఉపాధ్యాయులు ఎ.శశికుమార్, జీఎస్ఎస్ రాజశేఖర్, ఎన్.సీతారాం, కె.అచ్యుత్ పాల్గొన్నారు.

భవిత విద్యార్థులకు బహుమతుల పంపిణీ

ఆలమూరు: స్థానిక భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు మంగళవారం బహుమతుల పంపిణీ జరిగింది. సర్పంచ్ నేలపూడి లావణ్య తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగ విద్యార్థులందరికీ ఆట వస్తువులు, ఆహార పొట్లాలను అందజేశారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.మోక్షాంజలి, నాతి కుమార్‌రాజా, ఉపాధ్యాయులు సత్యకిరణ్, విజయలక్ష్మి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో ఓటర్ల జాబితా తయారు

కొత్తపేట: నియోజకవర్గంలో సమగ్రమైన ఓటర్ల జాబితా తయారు చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డీవో పి.శ్రీకర్ కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించిన అంశాలు వారికి తెలియజేసి, వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. నియోజకవర్గంలో ప్రతి పీఎస్ వద్ద, బీఎల్ఓల వద్ద, ఏపీఆర్ఓ కార్యాలయంలో తుది ఫొటో ఓటర్ల జాబితాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ పరిశీలించుకుని ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు తహసీల్దార్లు, డీటీలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పుల్లేటికుర్రులో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న అధికారులు

అంబాజీపేట: దాతలు అందిస్తున్న సహకారాన్ని, ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలకు వెళ్లాలని జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ బీర హనుమంతరావు, ఎంఈఓ మోకా ప్రకాష్ అన్నారు. విజయానంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు, జాతీయ అవార్డు గ్రహీత కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో పుల్లేటికుర్రు నెహ్రూ నగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 143 మంది విద్యార్థులకు పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. రూ.50 వేలు విలువైన నోట్ పుస్తకాలు, పలకలు, పరీక్ష అట్టలను విద్యార్థులకు ఆనందరావు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు డీవీ నారాయణ, గుబ్బల శ్రీనివాసరావు, పుల్లేటికుర్రు ప్రధానోపాధ్యాయులు డీవీ నారాయణ, క్లస్టర్ జాయింట్ సెక్రటరీ కేవీఎస్ కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.వీరవేణి, ఉపాధ్యాయులు వి.వరలక్ష్మి, కె.భూలక్ష్మి వె.ప్రియాంక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లంక గ్రామాలకు తప్పని ఇబ్బందులు



అప్పనపల్లిలో నదిలో కూలిపోయిన కొబ్బరి చెట్టు

మామిడికుదురు: తగ్గినట్లే తగ్గిన గోదావరి వరద మళ్లీ క్రమేపీ పెరుగుతోంది. గోదావరి నది ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో నీటి మట్టం క్రమక్రమంగా ఉధృతమవుతోంది. వైనతేయ గోదావరి నదిలో సుడులు తిరుగుతూ ప్రవహిస్తున్న వరదకు నదీకోత అంతకంతకు తీవ్రమవుతోంది. అప్పనపల్లి పాటురేవు సమీపంలో కొబ్బరి చెట్లు నది ఉధృతికి క్రమంగా నదిలో జారిపోతున్నాయి. అదే ప్రాంతంలో అండలు అండలుగా భూమి నదిలోకి కుంగిపోతోంది. పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, పాశర్లపూడి గ్రామాల్లో కూడా నదీకోత పరిస్థితి ప్రమాదకరంగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ విధమైన అలజడి ఏర్పడుతుందో తెలియని భయంతో తీవ్రంగా మదనపడుతున్నారు. గోదావరి వరద నీటితో పెదపట్నం, పెదపట్నంలంక గ్రామాల్లోని మధ్య లంక నుంచి పడవలపై పశుగ్రాసం తరలించుకోవడం ఎంతో ఇబ్బందిగా ఉందని రైతులు వాపోతున్నారు. వరద మరింత పెరిగితే తమ కష్టాలు రెట్టింపు అవుతాయన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని వశిష్ట, వైనతేయ నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెల వారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు, విద్యార్థులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా పెదమల్లంక, సిర్రా వారిలంక, అనగర్లంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. నదీపాయల వెంబడి లంకలు నీట మునగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కనకాయలంక వద్ద మరో రెండు అడుగులు వరద పెరిగితే కాజ్‌వే నీట మునిగే అవకాశం ఉంది.

విద్యార్థులకు లైఫ్ జాకెట్ల పంపిణీ



అయోధ్యలంకలో పడవలపై విద్యార్థులకు లైఫ్ జాకెట్లు అందజేస్తున్న మంత్రి సుభాష్

పి.గన్నవరం: వరదల నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు, విద్యార్థులు పడవలు దాటే సమయాల్లో తగు జాగ్రత్తలు పాటించాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం అయోధ్యలంక గ్రామం నుంచి పడవలు దాటి ఎల్.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం తన సొంత ఖర్చులతో 40 లైఫ్ జాకెట్లను మంత్రి సుభాష్ మంగళవారం అందజేశారు. అయోధ్యలంక వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సాధనాల జేడీ, వాసంశెట్టి కుమార్, సంసాని పెద్దిరాజు, గనిశెట్టి గంగాభవాని, అవనిగడ్డ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.